సాక్షి
చిత్తూరు

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023






బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.53,500 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,050 |
| వెండి: | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.70,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.72 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 31 | 21 |
| తిరుపతి | 32 | 21 |
| తిరుమల | 27 | 17 |
| గూడూరు | 32 | 23 |
| నగరి | 32 | 22 |



## వైభవంగా శ్రీవారి మెట్లోత్సవం

తిరుపతి కల్చరల్: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం మంగళవారం తెల్లవారుజామున అలిపిరి పాదాల మండపం వద్ద వైభవంగా నిర్వహించారు.

### న్యూస్‌రీల్

### పేదల ఆరోగ్యానికి 'ఆసరా'



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న అడిషినల్ డీఎంహెచ్‌ఓ హరినాథరెడ్డి

బంగారుపాళెం : పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోందని అడిషినల్ డీఎంహెచ్‌ఓ హరినాథరెడ్డి తెలిపారు. మంగళవారం బంగారుపాళెంలో ఆరోగ్య ఆసరా కింద లబ్ధిపొందిన వారిక ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్నవారు పూర్తిగా కోలుకునేంత వరకు ప్రభుత్వం ఆరోగ్య ఆసరా ద్వారా ప్రతి నెలా రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ క్రమంలో స్థానిక పాత పోస్టాఫీసు వీధికి చెందిన మహమ్మద్‌బేగ్ ఇంటికి వెళ్లారు. తిరుపతి బర్డ్‌లో వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్న ఆయనకు ఆరోగ్య ఆసరా పథకం కింద మొత్తం రూ.87,226 లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే మండలంలో 246 మంది ఆరోగ్య ఆసరా లబ్ధిదారులు ఉన్నారని హరినాథరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యాధికారి లోహిత్ చెంగల్‌రాయన్, ఎంపీహెచ్‌ఈఓ బృహస్పతి, సూపర్‌వైజర్ హరికృష్ణ, ఏఎన్‌ఎం గౌతమి, ఎంఎల్‌పీహెచ్ పునీత్ పాల్గొన్నారు.

### కేఈసీలో ప్రాజెక్టుల ప్రదర్శన



అగస్త్య ఫౌండేషన్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కుప్పం : పట్టణంలోని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల (కేఈసీ)లో అన్వేషణ కార్యక్రమం కింద మంగళవారం పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సినాప్సిస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రాజెక్టులకు బహుమతులు పంపిణీ చేశారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థుల ప్రదర్శనలకు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ సునీల్ రాజ్, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు సాయి చంద్రశేఖర్, మహాదీర్ కుమార్, ద్రవిడ వర్సిటీ ప్రొఫెసర్ యశోద పాల్గొన్నారు.


### గజదాడుల్లో పంటల ధ్వంసం



ఏనుగులు విరిచేసిన అరటి చెట్లు

పలమనేరు : మండలంలోని కృష్ణాపురం, ఏటిగడ్డ గ్రామాల్లో పలు పంటలను సోమవారం రాత్రి ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. నగేష్, సభాపతి, సామ్రాజ్‌లకు చెందిన అరటి, మామిడి, కొబ్బరి తోటల్లోకి చొరబడి చెట్లను విరిచేసింది. పుష్పరాజ్ అనే రైతు తన పొలానికి ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్‌ను నాశనం చేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు మంగళవారం ఘటనాస్థలాలకు వెళ్లి పంట నష్టంపై నివేదిక తయారు చేశారు. ఏనుగుల మళ్లీ వచ్చే ప్రమాదముందని, పొలాల వద్ద రాత్రివేళల్లో ఉండవద్దని రైతులకు సూచించారు.

### పక్కాగా భూ పరిహారం చెల్లింపు



జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పక్కాగా పరిహారం చెల్లించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ పీడీ కార్తీక్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ భూ పరిహారం చెల్లింపులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బెంగళూరు– చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. చిత్తూరు– తచ్చూరు జాతీయ రహదారి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో చిత్తూరు ఆర్డీఓ రేణుక పాల్గొన్నారు.

**చింతల గుంట సర్వేయర్‌పై విచారణ**

చిత్తూరు మండలం చింతలగుంట సచివాలయ సర్వేయర్‌పై మంగళవారం అదే గ్రామానికి చెందిన రైతులు జేసీకి ఫిర్యాదు చేశారు. తప్పుల తడకగా రీ సర్వే చేశారని పేర్కొన్నారు. సమస్యను వివరించినా పట్టించుకోలేదని ఆరోపించారు. నగదు వసూలు చేస్తున్నారని ఆధారాలతో తెలిపారు. స్పందించిన జేసీ వెంటనే విచారణ చేపట్టి నివేదిక అందించాలని సర్వేశాఖ అధికారులను ఆదేశించారు.

# లాభసాటిగా వ్యవసాయం

"ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి.. అన్నదాతలకు అండగా నిలవాలి.. రబీలో సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలి.. సేద్యాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు సలహాలు అందించాలి.. రైతు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు సహకరించాలి.. పొలంబడిలో సూచించిన విధానాలను పాటించేలా ప్రోత్సహించాలి.. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు పంటలను సందర్శించేలా చర్యలు చేపట్టాలి" అని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు.

- ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువుల పంపిణీ
- పల్లెల్లో పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ
- వివిధ శాఖల పురోగతిపై సమీక్షించిన కలెక్టర్

సాక్షి, చిత్తూరు : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. రబీలో సాగు విస్తీర్ణం, చిరుధాన్యాల సాగు, పొలం బడి తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రబీలో సాధారణంగా 29,026 హెక్టార్లలో సాగు చేస్తుంటారని, ప్రస్తుతం 14,626 హెక్టార్లలో సాగు మొదలైందని, మిగిలిన భూమిని కూడా సాగులోకి తీసుకువచ్చేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పొలంబడిలో నేర్చుకున్న నూతన విధానాలను సేద్యంలో అమలు చేసేలా అన్నదాతలకు దిశానిర్దేశం చేయాలన్నారు. అలాగే మిల్లెట్స్, వేరుశనగ, ఇతర పంటలకు సంబంధించి అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎప్పటికప్పుడు కొత్త విధానాలపై శాస్త్రవేత్తలతో సలహాలు ఇప్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 97శాతం ఈ–క్రాప్ నమోదు పూర్తయినట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో 1,650 క్వింటాళ్ల వేరు శనగ, 42 క్వింటాళ్ల మినుములు, 11 క్వింటాళ్ల పెసలు విత్తనాలను, 15,763 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేసినట్లు వివరించారు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్–2023లో భాగంగా గుడిపల్లె, శాంతిపురం, కుప్పం మండలాల్లోని 7 గ్రామాలను ఎంపిక చేశామని వెల్లడించారు.



వ్యవసాయాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

**పరిశుభ్రంగా పల్లెలు**

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ అధికారులు, కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామీణులకు సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలని స్పష్టం చేశారు. తాగునీటి పైపులైన్ల లీకేజీ, ఇతర మరమ్మతులను వెంటనే చేపట్టాలని సూచించారు. గ్రీన్ అంబాసిడ్ల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, వర్మీకంపోస్టు తయారు చేయించాలని తెలిపారు. ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలని, పన్ను వసూళ్లపై ఈఓపీఆర్డీలు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఓ లక్ష్మి, డీపీఎంఓ షణ్ముగం పాల్గొన్నారు.

**శ్మశానవాటికల ఏర్పాటుకు ప్రాధాన్యం**

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు అసైన్‌మెంట్ భూములు పంపిణీపై పకడ్బందీగా కసరత్తు చేపట్టాలన్నారు. జిల్లాలో 30 నుంచి 40 గ్రామాల్లో స్వామిత్ర సర్వే చేశారని తెలిపారు. మొత్తం 25,103 భూ హక్కు పత్రాలకు గాను ఇప్పటి వరకు 17,565 పత్రాలను పంపిణీ చేశారన వివరించారు. మిగిలినవి త్వరితగతిన అందించాలని సూచించారు. అలసత్వం లేకుండా రీ సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్పందన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

**అందుబాటులోకి అర్బన్ హెల్త్ సెంటర్లు**

అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా చిత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. టిడ్కో ఇళ్లకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కమిషనర్లు దృష్టి పెట్టాలని సూచించారు. పురపాలక ఆదాయం పెంచుకునేందుక పన్ను వసూళ్లను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు.

# అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



కల్లూరులో జెడ్పీ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో కలెక్టర్

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలో నిర్వహించిన పల్లెబాట ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలను అందించడమే కాకుండా, ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ మహిళలు సైతం ఆర్థికంగా బలోపేతమయ్యారని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ క్రమంలోనే పుంగనూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డిని కేంద్రబృందం సభ్యుల కలిశారు. జిల్లా అభివృద్ధిలో మంత్రి పాత్రపై ప్రశంసలు కురిపించారు. అనంతరం కల్లూరులో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన జెడ్పీ అతిథిగృహాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, పీఆర్ సీఈ చంద్రశేఖరరెడ్డి, నేతలు రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు**



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పార్టీలో చేరిన నేతలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరుకు చెందిన 35 మంది టీడీపీ నేతలు మంగళవారం పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

# ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం




మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైద్యసిబ్బందిని రోగులు దేవుళ్లుగా భావిస్తారని, అలాంటి పవిత్రమైన వృత్తిలో ఉన్నవారు పేదలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తున్నారని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద ఇంటి ముంగిటే వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చారని వెల్లడించారు. క్షయ బాధితులకు ప్రభుత్వమే పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఇందుకోసం దాతల నుంచి విరాళాల సేకరణ వద్దని, అవసరమైతే టీబీ రోగులను దత్తత తీసుకుని తన వంతు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ప్రజలకు మేలు చేస్తే ప్రతిపక్ష నేతలు ఓర్వలేరని, దాతలు అందించే సాయాన్ని సైతం వక్రీకరించేందుకు యత్నిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. నవరత్న పథకాలతో పేదలకు అండగా నిలుస్తుంటే టీడీపీ నేతలకు కడుపు మండిపోతోందని ఆరోపించారు. అందుకే అసత్య ప్రచారాలు, ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి రవిరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1,562 మంది టీబీ రోగులు ఉన్నారన్నారు. వ్యాధి ప్రభావం తగ్గించేందుకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్ మొదలియార్, శేషాద్రి పాల్గొన్నారు.

# విధుల్లో ఫస్ట్.. క్రీడల్లో బెస్ట్



ముంబాయి మార్‌థాన్‌లో ఎస్‌ఐరామకృష్ణ

అతనో ఓ పోలీస్ అధికిరి. విధులతో పాటు క్రీడలంటే ఆయనకు భలే ఇష్టం. అందులోనూ టెన్నిస్, మారథాన్ అంటే ప్రాణం. ఇలా రెండింటిపై దృష్టి పెడుతూ పట్టుదలతో విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్నేళ్లుగా శాంతిభద్రల పరిరక్షణతో పాటు క్రీడల్లోనూ పట్టుసాధిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిగే పోటీలకు సై 'పరుగు' తీస్తూ..విధుల్లోను తనదైన ముద్ర వేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ ఎస్‌ఐ వృత్తి..నేపథ్యం తెలుసుకుందాం..

- ఓ వైపు ఖాకీ ఉద్యోగం.. మరోవైపు క్రీడలపై వ్యామోహం
- అటు టెన్నిస్.. ఇటు మారథాన్‌లో ప్రత్యేక గుర్తింపు
- శాంతి భద్రతల్లోనూ తనదైన మార్క్
- చిత్తూరు ఎస్‌ఐ రామకృష్ణ ప్రతిభ

చిత్తూరు రూరల్, చిత్తూరు అర్బన్: కేసులు ఛేదించడంలో రాష్ట్ర స్థాయి గుర్తింపుతో పాటు క్రీడల్లో పతకాల పంట పండిస్తున్నారు చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రామకృష్ణ. కడపజిల్లా పులివెందుల నియోజకవర్గం గాజుల పేట ఈయన స్వగ్రామం. 2002లో కానిస్టేబుల్‌గా నాన్‌లోకల్ కింద మెదక్ జిల్లాలో ఎంపియ్యారు. అక్కడ ఆరేళ్ల పాటు పనిచేసి 2007లో జరిగిన ఎస్‌ఐ రాత పరీక్షలో 9 మార్కుల్లో పోస్టు కోల్పోయారు. 2009లో జరిగిన సెలక్షన్స్‌లో ఎస్‌ఐగా ఉద్యోగం సాధించి తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ పొందారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, శ్రీకాళహస్తి టూటౌన్, అలిపిరి, శ్రీకాళహస్తి రూరల్, ఏర్పేడు, బంగారుపాళ్యం స్టేషన్లలో పనిచేసి.. ప్రస్తుతం చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పోలీసుశాఖలో రాష్ట్రస్థాయిలో అందించే ఏబీసీడీ అవార్డు సైతం అందుకున్నారు. బంగారుపాళ్యంలో పనిచేసే సమయంలో చోరీకి గురైన రూ.1.37 కోట్ల విలువైన బంగారం ఆభరణాల కేసులో రామకృష్ణ కీలక పాత్ర పోషించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్టుచేసి 4.37 కేజీల బంగారాన్ని రికవరీ చేశారు. నగరిలో జరిగిన రూ.8 కోట్ల విలువైన సెల్‌ఫోన్ కంటైనర్ చోరీ కేసు ఛేదించి డీజీపీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

**మరో కోణం..**

పోలీసు విధులు నిర్వర్తిస్తూనే క్రీడలవైపు దృష్టి పెట్టారు. ఏడేళ్లుగా టెన్నిస్ ఆడుతున్న రామకృష్ణ ఆలిండియా సీనియర్స్ టెన్నిస్ అసోసియేషన్ (ఐస్టా)లో సింగిల్స్ విభాగంలో జాతీయస్థాయి 21, డబుల్స్‌లో 28వ ర్యాంకులో కొనసాగుతున్నారు. కరోనా నేపథ్యంలో టెన్నిస్ ఆడడం కుదరకపోవడంతో 2020లో పరుగు ప్రారంభించారు. ఇది కాస్త మారథాన్ వైపు మళ్లించింది. 15 హాఫ్ మారథాన్లు (21.1 కి.మీ), నాలుగు మీడియం మారథాన్ (30కి.మీ), ఇటీవల ముంబైలో మహా మారథాన్ (42.2కి.మీ)లో ప్రతిభ చూపించారు. టీసీఎస్ 10కే రన్‌ను 56 నిముషాల్లో, మున్నార్‌లోని కొండలపై హాఫ్ మారథాన్‌ను 2.18 గంటల్లో, పూణేలోని సతారా కొండల్లో హాఫ్ మారథాన్‌ను 2.13 గంటల్లో పూర్తి చేశారు. ఈనెల 15న ముంబైలో మహా మార్థాన్‌లో పాల్గొని 42.2 కి.మీ దూరాన్ని 4.19 గంటల వ్యవధిలో పూర్తి చేశారు.

**లక్ష్యం అమెరికా..**



స్కూల్ రోజుల నుంచే రన్నింగ్ అంటే ఇష్టం. అదే నాకు పోలీసు ఉద్యోగం తెచ్చిపెట్టింది. టెన్నిస్, మారథాన్‌లో రాణిస్తున్నానంటే కారణం కూడా పరుగు అంటే ఇష్టం. అమెరికాలోని బోస్టన్ మారథాన్‌లో పాల్గొనాలన్నదే నా జీవితాశయం. ఇందుకు కఠోర శిక్షణ అవసరం. విధులు నిర్వర్తిస్తూనే నా లక్ష్యం వైపు నడవడానికి జిల్లా పోలీసుశాఖ, ఎస్పీ ఎంతగానో ప్రోత్సహిస్తుండడం గర్వంగా ఉంది.

– రామకృష్ణ, ఎస్‌ఐ, చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్

# లోకేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం : కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్టుగా యువగళం పాదయాత్రలో నారా లోకేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శించారు. మంగళవారం మండలంలోని కలగటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. పాదయాత్ర ఎందుకు చేస్తున్నట్టో ప్రజలకు చెప్పుకోవాలని కానీ, ఏది పడితే అది మాట్లాడితే సహించే ప్రసక్తే లేదన్నారు. తాత, తండ్రి పేరు చెప్పుకుని బతికే లోకేష్‌కు జగనన్న ముద్రతో సొంతంగా ఎమ్మెల్యేగా గెలిచిన తనకు చాలా వ్యత్యాసముందని తెలిపారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేక దొడ్డిదారిన తండ్రి అండతో ఎమ్మెల్సీ పదవి దక్కించుకుని మంత్రిగా చేసిన అసమర్థుడు లోకేష్ అని మండిపడ్డారు. నాలుగురోజులకే జనం లేక పాదయాత్ర నవ్వులపాలైనా ఇంకా బుద్ధిరాలేదని ఎద్దేవా చేశారు. చినబాబు పాదయాత్ర వల్ల అనర్థాలే తప్ప, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని చెప్పారు. కుప్పంలో నిర్వహించిన బహిరంగ సభలో బీసీ మహిళ అనే కనీస జ్ఞానం కూడా లేకుండా వనిత ఏం పీకుతోందని వ్యాఖ్యానించడం లోకేష్ కుసంస్కారానికి నిదర్శనమన్నారు. మా స్వగ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని నోటికొచ్చినట్టు మాట్లాడితే గ్రామస్తులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నియోజకవర్గంలో నిత్యం సుమారు 10వేల మంది బెంగళూరుకు ఉపాధి కోసం వలస పోతుండడం గుర్తించలేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వైనాట్ 175 పిలుపును రాబోయే ఎన్నికల్లో ప్రజలు నిజం చేస్తారని, అప్పుడు తండ్రితో కలిసి లోకేష్ కూడా ఇంటికే పరిమితమవుతారని స్పష్టం చేశారు.

# అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళ్యం(యాదమరి): పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆదేశించారు. సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించిన అమరరాజా గ్రోత్ కారిడార్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీబీడీ సెక్షన్‌లో బ్యాటరీస్ ఫిల్ చేస్తుండగా యాసిడ్ లీకై పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడడంతో షార్ట్‌సర్క్యూట్ అయినట్లు అధికారులు వివరించారు. ఆ సమయంలో కార్మికులు భోజనం చేసేందుకు క్యాంటిన్‌కు వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. అగ్నిమాపక సామగ్రి అందుబాటులో లేకపోవడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు వివరించారు.

# అట్టహాసంగా సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభం

- తుమ్మలగుంట గ్రౌండ్‌లో జిల్లా స్థాయి ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు
- తొలిరోజు ఆరు మ్యాచ్‌లు

**రుపతి ఎడ్యుకేషన్ :** రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి మీడియా గ్రూప్ నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఐసీసీ నిబంధనల మేరకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తున్న ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలకు తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట క్రీడా మైదానం వేదికయ్యింది. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వివిధ విద్యాసంస్థల నుంచి సీనియర్స్ విభాగంలో 31, జూనియర్స్ విభాగంలో 7, మొత్తం 38 జట్లు పాల్గొంటున్నాయి.

SAKSHI MEDIA GROUP

### ప్రతిభను వెలికితీయడానికే

తొలిరోజు మంగళవారం ఎస్‌పీఎల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, లా అండ్ ఆర్డర్, అడ్మిన్ అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకట్రావ్ పాల్గొన్నారు. క్రికెటర్లను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఎస్‌పీఎల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌పీఎల్ పోటీలను నిర్వహిస్తున్న సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అదనపు ఎస్పీలు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. గెలుపోటములకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు మాట్లాడుతూ ఎస్‌పీఎల్ పోటీలను జిల్లా, రీజనల్, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

SPL SAKSHI PREMIER LEAGUE



ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల- ఎమరాల్డ్స్ జట్ల మధ్య క్రికెట్ పోటీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీలు వెంకట్రావ్, కులశేఖర్ తదితరులు

### తొలి రోజు మ్యాచ్‌లు ఇలా..

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తుమ్మలగుంట క్రీడా మైదానంలో తొలిరోజు సీనియర్స్ విభాగంలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. రెండు మైదానాల్లో కలిపి మొత్తం 6మ్యాచ్‌లు నిర్వహించారు. బ్యాట్స్‌మెన్లు ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. బౌలర్లు పదునైన బంతులతో వికెట్లను పడగొట్టి ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపించారు.




55 పరుగులు చేసిన శేఖర్‌నాయక్

### గ్రౌండ్ 1లో...

- ఎస్‌జీఎస్ జట్టుపై ఎస్వీయూ జట్టు 10 వికెట్ల తేడాతో సునాయస విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌జీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఎస్వీయూ జట్టు కేవలం 3.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. ఎస్వీయూ జట్టు బ్యాట్స్‌మెన్ వినయ్ 20 బంతుల్లో 6ఫోర్లు, 1 సిక్స్‌తో 39 పరుగులు చేశాడు.
- సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల జట్టుపై రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల జట్టు 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎమరాల్డ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన సెవెన్‌హిల్స్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 82 పరుగులు మాత్రమే చేసింది. ఎమరాల్డ్స్ బ్యాట్స్‌మెన్ భరత్ 25 బంతుల్లో 4 ఫోర్లు 2 సిక్సర్లతో 40 పరుగులు చేశాడు.
- పుత్తూరు శ్రీరమణ డిగ్రీ కళాశాల జట్టుపై శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మశీ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీరమణ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 54 పరుగులు చేయగా, శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మశీ జట్టు 4.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి విజయం సాధించింది.

### గ్రౌండ్ 2లో..

- ఎస్వీఈసీ జట్టుపై 41 పరుగుల తేడాతో తిరుపతి ఎమరాల్డ్స్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎమరాల్డ్స్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేయగా, ఎస్వీఈసీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 53 పరుగులు మాత్రమే చేసింది. ఎమరాల్డ్స్ జట్టు బ్యాట్స్‌మెన్ మదన్ 16 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30 పరుగులు చేశాడు.
- ఎస్వీసీఈ జట్టుపై 35 పరుగుల తేడా ఎస్‌డీహెచ్‌ఆర్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ జట్టు 53 పరుగులకు ఆలవుట్ అయ్యింది. ఈ మ్యాచ్‌లో ఎస్‌డీహెచ్‌ఆర్ బౌలర్ లోకేష్ 2 ఓవర్లలో 5 వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్నాడు.
- గొల్లపల్లి సిద్ధార్థ జట్టుపై ఎస్‌జీఎస్ జట్టు 34 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌జీఎస్ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగా.. తరువాత బ్యాటింగ్‌కు దిగిన గొల్లపల్లి సిద్ధార్థ జట్టు 10 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. ఎస్‌జీఎస్ జట్టు బ్యాట్స్‌మెన్ శేఖర్ 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 50 పరుగులు చేశాడు.



బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



గెలుపొందిన ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు



గెలుపొందిన పద్మావతి స్కూల్‌ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు క్రికెట్ జట్టు సభ్యులు



విజయకేతనం ఎగురవేసిన ఎస్‌జీఎస్ కళాశాల జట్టు



## శ్రీవారి సేవలో మంత్రి రోజా



**తిరుమల:** రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

## ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో 19వ బ్యాచ్‌కి దరఖాస్తుల స్వీకరణ

**తిరుపతి అర్బన్:** తిరుపతి అలిపిరి డిపో పరిధిలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ కోసం 19వ బ్యాచ్‌కి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఇన్‌చార్జి డీఎం ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18వ బ్యాచ్‌కు శిక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 17 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వెల్లడించారు. డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ర్యాగ్ పికర్స్‌కు శిక్షణ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని ర్యాగ్ పికర్స్ (చెత్త, ప్లాస్టిక్ ఏరుకునే వ్యక్తులు)కు ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈడీ మాట్లాడుతూ అపరిశుభ్రమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న ర్యాగ్ పికర్స్‌కు ప్రత్యేక శిక్షణ అందించి, పలు కంపెనీల్లో ఉపాధి పొందే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు

## భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

**చిత్తూరు అర్బన్:** భార్య ఆత్మహత్య కేసులో భర్తను టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. నగరంలోని ఇరువారానికి చెందిన మణిమేఘలై అనే మహిళ భర్త మోహన్ వేధింపుల కారణంగా మూడు రోజుల క్రితం ఇంట్లోనే ఉరి వేసుకుంది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

## ఒడిశా కూలీ ఆత్మహత్య

**గంగవరం:** మండలంలోని సరస్వతీనగర్‌కు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఒడిస్సాకు చెందిన బోరు డ్రిల్లింగ్ వాహనం కార్మికుడు హరిరామ్‌రావత్(43) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం..హరిరామ్‌రావత్ తాగుడు బానిసై కూలీ పనులకు పోకుండా చిల్లరగా తిరిగేవాడు. దీంతో కొడుకు మందలించి గుడియాత్తంలో తనతో పాటు బోర్‌వెల్స్ పనిలో చేర్చాడు. సోమవారం రాత్రి పలమనేరుకు సమీపం, సరస్వతీనగర్ వద్ద బోరు వేసేందుకు రిగ్గు బండితో కలిసి వచ్చాడు. అర్ధరాత్రి దాటాక కూలీలందరూ సేదతీరుతున్న సమయంలో ఇతను దూరంగా వెళ్లాడు. చెట్టుకు తలపాగాతో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఉదయం గమనించిన తోటి కూలీలు విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన కార్మికుడు

## వ్యాన్‌ను ఢీకొన్న కారు

**పూతలపట్టు:** తిరుపతి నుంచి చిత్తూరుకు వస్తున్న వ్యాన్‌ను ఓవర్‌టేక్ చేయబోయి వెనుక నుంచి ఓ కారు ఢీకొంది. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి. కారు డ్రైవర్ అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

## ట్రాక్టర్‌ను ఢీకొన్న చేపల లారీ : క్లీనర్ మృతి

**దొరవారిసత్రం:** అతివేగానికి తోడు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా చేపల మినీ లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. నెల్లూరు నుంచి చేపల లోడ్డుతో చెన్నై మార్కెట్‌కు మినీ లారీ బయలుదేరింది. మార్గమధ్యంలోని కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీంలో డ్రైవర్ భాస్కర్ నిద్రలోకి జారుకోవడంతో ముందు కట్టెల లోడ్డుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ఒక్కసారిగా నడిరోడ్డుపై బోల్తాకొట్టింది. మధురైకి చెందిన లారీ క్లీనర్ చిన్నపాండ్యన్(30) అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన డ్రైవర్‌ను స్వర్ణాటోల్‌వే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి.. క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ తిరుములరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా చేపలు

## ప్రయోగాలతో బహుళ ప్రయోజనం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



బహుమతులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

**వి.కోట:** సైన్స్ ప్రయోగాలతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలున్నాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే హాజరయ్యారు. జ్యోతి ప్రజల్వన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల ఎగ్జిబిట్‌లను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీఓ వెంకట్రామిరెడ్డి , డిప్యూటీ డీఈఓ చంద్రశేఖర్, ఎంపీపీ యువరాజ్, ఎంఈఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలగురునాథ్, సింగల్ విండో చైర్మన్ ధనం భక్త ,ఎంపీడీఓ బాలాజీ పాల్గొన్నారు.

## బడి బయట పిల్లల గుర్తింపు

**చిత్తూరు కలెక్టరేట్ :** చదువు మానేసిన 10 మంది బడి బయట పిల్లలను అధికారులు గుర్తించారు. మంగళవారం చిత్తూరులోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొంగారెడ్డిపల్లె, ఎన్టీఆర్ బస్టాండ్, పాత బస్టాండ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పర్యటించారు. బడి మానేసిన పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థులను బడికి పంపకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే బస్టాండులో పనిచేస్తున్న ముగ్గురు బాలులను జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ప్రవేశపెట్టారు. వారి కుటుంబీకులు వచ్చాక కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించారు. డ్రైవ్‌లో సమగ్రశిక్ష శాఖ ఏఎల్ఎస్ఓ అజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది శివశంకర్, ప్రతిమ పాల్గొన్నారు.



ప్రత్యేక డ్రైవ్‌లో వివిధ శాఖల అధికారులు

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**చిత్తూరు రూరల్:** వస్తువుల కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు ఉండాలని, ఈ విషయాన్ని వినియోగదారులు, శాఖ అధికారులు గుర్తించాలని డీఎస్ఓ శంకరన్ అన్నారు. చిత్తూరు కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయిస్ సమావేశ మందిరంలో మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్(బీఐఎస్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్లు సుజాత, రమాకాంత్ నాణ్యత ప్రమాణాలపై పలు విషయాలను అధికారులకు, సిబ్బందికి వివరించారు. అనంతరం డీఎస్ఓ శంకరన్ మాట్లాడుతూ వస్తువుల విక్రయాల్లో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు. అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. బీఐఎస్ వైబ్‌సైట్‌ను పరిశీలించి వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రధానంగా సిమెంట్, స్టీల్, మందులు, మాత్రలు, వైద్య పరికరాలు, బంగారం, తినుబండరాలు, విద్యుత్ పరికరాలు తదితర 458 వస్తువులను కొనుగోలు చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.



మాట్లాడుతున్న బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సుజాత

## సర్పంచ్‌ల సమావేశానికి ఆహ్వానం

**రొంపిచెర్ల:** తాడేపల్లెలో బుధవారం నిర్వహించనున్న సర్పంచ్‌ల సమావేశానికి రొంపిచెర్ల సర్పంచ్ ఇబ్రహీంఖాన్‌కు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఆహ్వానం పంపింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచన మేరకు పుంగనూరు నియోజకవర్గం సర్పంచ్ సంఘం ప్రతినిధి ఎంపిక చేసినట్లు పేర్కొంది. ఇబ్రహీంఖాన్ ఉత్తమ సర్పంచ్‌గా పదేళ్ల క్రితమే అవార్డు అందుకోవడం విశేషం. ప్రస్తుతం మళ్లీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంత్రి సహకారంతో రొంపిచెర్ల పంచాయతీ ఆదర్శవంతంగా తయారు చేస్తుండడం గమనార్హం.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

**చౌడేపల్లి :** పలమనేరు మార్గంలని దాదాపల్లె వద్ద మంగళవారం ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వివరాలు.. పుంగనూరు మండలం ఇటికి నెల్లూరుకు చెందిన నరేంద్ర ట్రాక్టర్ తీసుకుని దుర్గసముద్రం గ్రామంలో బోరు పైపులను లాగేందుకు బయలుదేరాడు. అప్పటికే మద్యం సేవించిన నరేంద్ర మార్గంమధ్యలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో 11 కేవీ విద్యుత్ తీగలున్న స్తంభం రోడ్డుపై పడిపోయింది. స్థానికులు వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు ఘటనాస్థనానికి వెళ్లి ట్రాన్స్‌కో సిబ్బంది సాయంతో విద్యుత్ తీగలను తొలగించారు. ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ ఈ ఘటనకు కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ట్రాక్టర్ ఢీకొనడంతో రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం